క్లుప్తంగా

విద్యార్థులకు చేతిరాతపై పోటీలు



చేతిరాతలో రాణించిన వారిని అభినందిస్తున్న హెచ్ఎం కేశవరావు

హిరమండలం: విద్యార్థులు చేతిరాతపై దృష్టి సారించాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవరావు అన్నారు. పాఠశాలలో 475 మంది విద్యార్థులకు చేతరాతపై సోమవారం పోటీలు నిర్వహించారు. వీరిలో 14 మంది చక్కటి దస్తూరితో రాసినట్టు హెచ్ఎం పేర్కొన్నారు. వారిని ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేశారు. చదువు ఎంత ముఖ్యమో చేతిరాతకూడా అంతే ముఖ్యమన్నారు. దస్తూరి బాగుంటే మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి నెలా చేతిరాతపై పోటీలు నిర్వహిస్తామన్నారు.

మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా హైమావతి



ఎల్.ఎన్.పేట: మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా వై.హైమావతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన వసంతకుమార్ పదోన్నతితో కూడిన బదిలీపై వెళ్లడంతో కొన్ని నెలలుగా సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉంది. టెక్కలి పంచాయతీరాజ్ కార్యాలయంలో పనిచేస్తున్న హైమావతిని పదోన్నతిపై ఇక్కడ నియమించినట్టు ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్ తెలిపారు.

చెడు వ్యసనాలకు బానిసకావద్దు



మాట్లాడుతున్న కేశవరావు

బూర్జ: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మానవ అక్రమ రవాణా నిరోధక ఎస్సై కేశవరావు అన్నారు. కొల్లివలస కేజీబీవీలో కేఎస్‌సీఎఫ్, ఏహెచ్‌టీయూ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులతో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలకు స్వస్తి చెప్పాలన్నారు. లైంగిక వేధింపులకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. చిల్డ్రన్ ఫౌండేషన్ సిబ్బంది కైలాస్ సత్యర్థి, బూర్జ మండల కోఆర్డినేటర్ శ్రీనివాస్, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభం



గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభిస్తున్న కృష్ణదాస్

నరసన్నపేట: మండలంలోని ఎన్‌బీసీ ప్రధాన కాలువతో పాటు పోలాకి, దేశవానిపేట వద్ద ఉన్న వంశధార కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగించే పనులు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం ప్రారంభించారు. పనులను శ్రద్ధగా చేపట్టాలని సూచించారు. ఇప్పటికిప్పుడు అన్ని చానళ్లలో గుర్రపు డెక్క తొలగించడం సాధ్యం కాదన్నారు. అందుకే ప్రధాన కాలువల్లో తొలగిస్తే పిల్ల కాల్వలకు నీరు సక్రమంగా అందుతుందనే ఉద్దేశంతో పనులు చేపట్టామన్నారు. గుర్రపు డెక్క తొలగింపునకు రూ. 6 లక్షలు మంజూరైందని వంశధార ఏఈ సురేష్ తెలిపారు.

సక్రమంగా డీవార్మింగ్ మాత్రలు పంపిణీ

సరుబుజ్జిలి: అందరూ సమన్వయంతో పని చేసి నులి పురుగుల (డీవార్మింగ్) నివారణ మాత్రలు సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీడీవో పీవీ మురళీమోహన్‌కుమార్ అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో అన్ని పాఠశాలల హెచ్ఎంలు, అంగన్‌వాడీ, ఆరోగ్యశాఖ సిబ్బందితో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల పదో తేదీనన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి సంతోష్‌కుమార్, సీహెచ్‌వో మోహనరావు, ఎంఈవోలు బాలరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన

బూర్జ: పంటకోత ప్రయోగాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయ డిప్యూటీ ఎస్‌వో వి.సుజాత కుమారి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో పంటకోత ప్రయోగాలపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. పంట కోత ప్రయోగాలు రైతుల సమక్షంలో నిర్వహించాలన్నారు. తహసీల్దారు ఎస్.రమణారావు, మండల వ్యవసాయాధికారి వి.రాజేశ్వరరావు, ఏఎస్ఓ పి.ఉషారాణి, వీఆర్వోలు, అగ్రికల్చర్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- ఖాజీపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పొందూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనలో గడప గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సంక్షేమ పథకాలను సక్రమంగా అందుతున్నట్టు ప్రజలు స్వయంగా వచ్చి చెబుతుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. కింతలి పంచాయతీ ఖాజీపేట గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్టు చెప్పారు. నిరుపేదల గౌరవాన్ని పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల వర్తింపు కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, నాయకులు గాడు నాగరాజు, చింతాడ ప్రసాద్, సింగూరు సూర్యనారాయణ, తేజేశ్వరరావు, బొమ్మాలి శేషగిరి, కిల్లి సన్యాసిరావు, పైడి లక్ష్మణరావు, రంగనాథం పాల్గొన్నారు.

పంచాయతీలకు ఉప ఎన్నికలు

సారవకోట: బద్రి గ్రామ పంచాయతీ సర్పంచ్‌తో పాటు పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వార్డు స్థానాలకు ఈ నెల 19న ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విశ్వేశ్వరరావు తెలిపారు. బద్రీ సర్పంచ్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించామన్నారు. అలాగే చిన్నకిట్టాలపాడు పంచాయితీలో ఖాళీగా ఉన్న 3, 10, కరడశింగిలో 2, 4, 7, రామకృష్ణాపురం, గోవర్ధపురం పంచాయితీల్లో ఒకటో వార్డు, లక్ష్మీపురంలో మూడోవార్డు స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. మంగళవారం నుంచి పదో తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

- ఆమదాలవలస రూరల్: అక్కివరం గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి, కొరపాం పంచాయతీ పరిధిలో 4వ వార్డు, కలివరం పంచాయతీ పరిధి రెండో వార్డు స్థానాలకు నిర్వహిస్తున్నట్టు మండల ఎన్నికల అధికారి ఎస్.వాసుదేవరావు తెలిపారు.
- జలుమూరు: కొమనాపల్లి పంచాయతీలో తొమ్మిదో, జోనంకిలో రెండో వార్డుకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు సంబంధిత అధికారి తెలిపారు.

- పాతపట్నం: మండలంలోని నాలుగు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న ఐదు వార్డు సభ్యుల స్థానాలకు 19వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో పి.జయంత్ ప్రసాద్ తెలిపారు. సరాలిలో 2, 4, గురండిలో 8వ, ఏ.ఎస్.కవిటిలో పదో, చాకిపల్లిలో మూడో వార్డుకు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి



ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాతపట్నం: గంగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నూలుపోగులు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు పి.ఆర్.వల్లభరావు మాట్లాడుతూ.. ఆధునిక భావకవిత్వానికి కాస్త దూరంగా, సామాజిక సమస్యల్ని ఎత్తిచూపుతూ కవిత్వాలను ఠాగూర్ రాసేవారని గుర్తుచేశారు. ఠాగూర్ రచించిన గీతాంజలి కావ్యానికి సాహిత్యంలో నోబెల్ బహుమతిని అందుకున్నారన్నారు. 2023 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని ముదిలి రత్నకుమార్‌కు విద్యా పురస్కారంలో భాగంగా ట్రస్ట్ తరపున వేయి రూపాయలు అందజేశారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బందన శ్రీనివాసరావు, పి.రామరాజు, ఉపాధ్యాయులు ఎం.షణ్ముఖరావు, చంద్రావు, తారకేశ్వరరావు, శంకరరావు, ఎం.వాసుదేవరావు, లక్ష్మణరావు, శారద, శశివర్ణ, శ్యాంసుందరరావు, సుందరమ్మ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను వినియోగించాలి



నరసన్నపేట: విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



హిరమండలం: చేనేతపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌వో కృష్ణవేణి

నరసన్నపేట: చేనేత రంగంలో అనేక కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారని నరసన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. వారికి అండగా ఉండేందుకు ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని కోరారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిరమండలం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చేనేతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎస్.కృష్ణవేణి మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిందన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి



నరసన్నపేట:గద్దర్ చిత్రపటాలతో అభిమానులు



కొత్తూరు: మౌనం పాటిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

నరసన్నపేట: తన గళం, గానంతో ప్రజలను చైతన్యపరిచే ప్రజా గాయకుడు గద్దర్ లేని లోటు పూడ్చలేనిదని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రతినిధి నేతింటి నీలంరాజు అన్నారు. కోమర్తి కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గద్దర్ అభిమానులు పాల్గొన్నారు.

కొత్తూరు: ప్రజాగాయకుడు గద్దర్‌కు కొత్తూరులోని విశ్రాంతి ఉద్యోగులు నివాళులర్పించారు. విశ్రాంతి ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎద్దు గోపాలదాసు నాయుడు, అధ్యక్షుడు సీతారామూర్తి, సభ్యులు దుర్గాశి గుమ్మయ్య, కృష్ణచంద్ర పట్నాయక్ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వ సాయం



పోషకాహార కిట్లు పంపిణీలో నాయకులు

ఎల్.ఎన్.పేట: మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పోషకాలతో కూడిన కిట్లు పంపిణీ చేస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు అన్నారు. యంబరాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సోమవారం సంపూర్ణ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలమల గోవిందరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెనుమజ్జి విష్ణుమూర్తి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నవ భారతి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

సారవకోట: సారవకోట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం అవగాహన కల్పించారు. గర్భిణులు ఎటువంటి ఆహారం, జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. బిడ్డకు తల్లి పాలు అందించడం ద్వారా చేకూరనున్న ప్రయోజనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుజుపురం రామారావు, సారవకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, మండల కేంద్రంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

జలుమూరు: మండలంలోని లింగాలవలస, పాగోడు, వెంకటాపురం రేషన్ డీలర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తహసీల్దార్ బి.సత్యం సోమవారం తెలిపారు. లింగాలవలస ఎస్సీ జనరల్, పాగోడు ఓసీ ఉమెన్, వెంకటాపురం ఎస్సీ ఉమెన్‌కు రిజర్వు చేసినట్టు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 16వ తేదీన శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాతపరీక్ష ఉంటుందన్నారు. 19న ఇంటర్వ్యూను నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస రూరల్: మండలంలో కొత్త రోడ్డు వద్ద ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలను మార్పిడి చేస్తున్నారు. దీంతో మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాగోలు సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తరోడ్డు, గోపీనగర్, తోటాడ, అక్కివరం, మహసాహెబ్‌పేట గ్రామాలకు సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థినులు

బూర్జ: స్థానిక కేజీబీవీ నుంచి అదృశ్యమైన ఇద్దరు విద్యార్థినులను తహసీల్దార్ ఎస్.రమణారావు సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి వారి తల్లిదండ్రులకు సోమవారం అప్పగించారు. ఆదివారం బూర్జ పోలీసులు స్టేషన్‌కు తీసుకుని వచ్చి ఎస్సై బి.అశోక్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అప్పగించినప్పటికీ సెలవు కావడంతో మరోసారి సోమవారం తహసీల్దార్ సమక్షంలో విద్యార్థినులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సై బి.అశోక్‌బాబు, కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.గాయత్రి ఉన్నారు.

స్త్రీనిధి ద్వారా రుణాలు



రుణాల గురించి వివరిస్తున్న కూర్మారావు

ఆమదాలవలస రూరల్: పంచసూత్రాలు పాటిస్తున్న మహిళా సంఘాల్లోని సభ్యులకు చేనేత రంగం అభివృద్ధి కోసం పెట్టుబడికి తక్కువ శాతానికే స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నట్టు వైఎస్సార్‌క్రాంతి పథం ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. శ్రీనివాసాచార్యులపేట గ్రామంలోని మహిళా సంఘం సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీనిధి ద్వారా మగ్గం నేత మహిళలకు తొమ్మిది శాతానికి రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రామంలో 135 కుటుంబాలకు నేతన్న నేస్తం ద్వారా రూ. 1.29 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. సబ్సిడీ ద్వారా నేతన్నలకు యంత్రాలను మంజూరు చేసినట్లు చెప్పారు. సమావేశంలో గ్రామసంఘం అధ్యక్షురాలు పి.సంధ్య, క్లస్టర్ కో ఆర్డినేటర్ సుభద్ర, రామప్పడు, చంద్రరావు, రమణ, వీవోఏలు సుశీల, లక్ష్మి పాల్గొన్నారు.

స్థానిక నాయకత్వంతోనే అభివృద్ధి

ఎల్.ఎన్.పేట: స్థానిక నాయకత్వంతో పాతపట్నం అభివృద్ధి చెందుతుందని విద్యా వేత్త సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. సోమవారం లక్ష్మీనర్సుపేట, బొర్రంపేట, ఎల్.ఎన్.పేట గ్రామాల్లో పర్యటించారు. పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.

జోరు వానలో.. ఇంటింటికీ..



ఆదివరపుపేటలో లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'నిర్వహించిన ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: జోరు వానలో ఇంటింటికీ నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సందర్శించి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నామని చెప్పారు. మేజరు పంచాయతీ నరసన్నపేటలోని ఆదివరపుపేట, బొంతలవీధి, కామేశ్వరినగర్, సత్యన్నారాయణనగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియతో కలిసి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను తెలియజేశారు. చేకూరిన లబ్ధిని వివరించి రేషన్‌కార్డు వారీగా బుక్‌లెట్‌ను అందజేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు వేయాలని, మంచినీటి సదుపాయం మెరుగు పరచాలని పలువురు మహిళలు కోరారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో ఇంటివద్దకే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ అవుతున్నాయన్నారు. వలంటీర్లు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారన్నారు. మంచిని కోరుతూ పేద వర్గాలందరినీ ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌పై ప్రతిపక్షాలు, దత్తపుత్రుడు చేస్తున్న లేనిపోని విమర్శలను ప్రజలు గమనించాలన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు దిమ్మతిరిగే తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. రాజకీయాలకు ఆయన్ని దూరం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, సుడా చైర్‌పర్సన్ కోరాడ ఆశాలత, జెడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు చింతు రామారావు, గుప్త, పి.సాయిప్రసాద్, పతివాడ గిరీశ్వరరావు, బొబ్బాది ఈశ్వరరావు, కనపల శేఖరరావు, పెదిరెడ్ల రాము, పాగోటి రాజారావు, కోరాడ చక్రధర్, వైశ్యరాజు కేశవరాజు, గనగళ్ల శ్రీను పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం చేరువ



ఏపీహెచ్‌బీ కాలనీలో సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- పాతపట్నంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పాతపట్నం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేరువ చేస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం మండల కేంద్రం సచివాలయం–3 పరిధిలోని రామమందిర్‌వీధి, ఆస్పత్రి కూడలి, ఏపీహెచ్‌బీ కాలనీ, బాలాజీ నగర్ 1, 2, 3 వీధుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలు గురించి వివరించి బ్రోచర్లను అందజేశారు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతిఒక్కరు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు అందజేయటం జరుగుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల పథకాలు అమలు చేయటంతో పాటు చెప్పని ఎన్నో పనులు చేస్తున్నారని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. అడ్డదారుల్లో అధికారం పొందేందుకు ప్రజలకు మాయ మాటలు చెప్పేందుకు గ్రామాలకు వస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కరుణాకరరావు, తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీవో జయంత్ ప్రసాద్, ఈవో కూర్మారావు, ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, సచివాలయ మండల కన్వీనర్ ఎనుతల సూర్యం, వైస్ ఎంపీపీ ప్రదీప్, ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, కర్రి లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ మమత, సుధాకర్, రాజు, వరదరాజులు, శ్రీనివాసరావు, ధనుంజయ్, రామారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న శ్రీనివాసబాబు


నరసన్నపేట: స్వయంశక్తి సంఘాల సభ్యులు ఆర్థిక లావాదేవీలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఫైనాన్స్ విభాగం ఏపీఎం శ్రీనివాసబాబు అన్నారు. నరసన్నపేట వెలుగు కార్యాలయంలో ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌పై గ్రామ సంఘం అధ్యక్షులు, వీఓఏలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సంఘాల్లో నిధులు, వినియోగం, వడ్డీ నిర్ణయం, పొదుపు కట్టుదల, అప్పులు ఇవ్వడం, కట్టించుకోవడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. పారదర్శకంగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏసీ కొండలరావు పలు సూచనలు చేశారు. క్రమశిక్షణగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షుడు చింతు శ్రీదేవి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

స్నేహితుల ఔదార్యం

కొత్తూరు: కష్టాల్లో ఉన్న ఓ కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. కొత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన సింహాంద్రి రామకృష్ణ మృతి చెందాడు. దీంతో భార్య అకాంక్ష, పిల్లలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను రామృకృష్ణతో చదివిన తోటి విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఇందురోతు శంకరరావు పూర్వపు విద్యార్థులకు వాట్సాప్ ద్వారా చేరవేశారు. స్పందించిన స్నేహితులంతా రూ. 62 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని కొత్తూరు మండలం ఎన్ఎన్ కాలనీలో ఉంటున్న స్నేహితుడు భార్య అకాంక్షకు సోమవారం అందజేశారు. పూర్వ విద్యార్థులు గెర్లె గడ్డయ్య, రామచంద్రరావు, గిరిబాబు, రమేష్, కవిత, దనల్మో, శైలజ పాల్గొన్నారు.

ఎన్‌జీవో తాలూకా కార్యదర్శిగా జానకీరామయ్య



కొత్తూరు: కొత్తూరు పాత తాలూక ఎన్‌జీవో సంఘం కార్యదర్శిగా స్థానిక ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకీరామయ్య నియమితులయ్యారు. ఈ విషయాన్ని స్థానిక తాలూక అధ్యక్షుడు ఆల్లు తిరుపతిరావు సోమవారం తెలిపారు.

వృద్ధుడుపై వ్యక్తిదాడి

పాతపట్నం: మండలంలోని బడ్డుమర్రి గ్రామానికి చెందిన వృద్ధుడు గొర్లి నారాయణపై మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన రాణ సింహాచలం దాడి చేశాడని ఫిర్యాదు అందినట్టు ఎస్సై మహమ్మద్ యాసీన్ సోమవారం తెలిపారు. కుటుంబ కలహాలతో దాడి జరిగినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గ్రామ సంఘాలను బలోపేతం చేయాలి

మెళియాపుట్టి: గ్రామ సంఘాలను బలోపేతం చేయాలని స్త్రీనిధి మేనేజర్ సాయిరాం అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఎ.లలిత ఆధ్వర్యంలో వీఓఏలకు రెండు రోజుల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. స్త్రీనిధి ఏజీఎం సత్యనారాయణ, ఏసీ సుబ్బయ్యనాయుడు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

బూర్జ: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ భగవత్ శ్రీమాన్ ఎస్.వి.రమణ అన్నారు. మండలంలోని పెద్దపేట అభయ ఆంజనేయస్వామి గుడిలో సోమవా రం భజనలు చేసి భక్తి గీతాలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పక్కాగా పంట నమోదు

కొత్తూరు: ఖరీఫ్ వరి పంట నమోదు పక్కాగా నమోదు చేయాలని ఏవో శ్రీనివాసరావు వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. పంట నమోదులో ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పంట కోత నమోదు, పంట కోత ప్రయోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్‌వో పెద కోట బాలరాజు, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

ఆమదాలవలస రూరల్: రైతులు సాగు చేసే పంటల వివరాలను ఈ–క్రాప్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ ధికారి మెట్ట మోహనరావు తెలిపారు. శ్రీనివాసాచార్యులపేట గ్రామ రెవెన్యూ పరిధిలో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసే పంట వివరాలతో యాప్‌లో నమోదు చేయడం వలన ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీలు కాలంలో అందుతాయన్నారు. పరిశీలనలో వీఏఏ జగదీశ్వరరావు ఉన్నారు.

హిరమండలం: రైతులు తాము పండించిన పంటలను తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, తహసీల్దార్ బి.మురళీమోహన్ అన్నారు. స్థానిక వైకేపీ (వెలుగు) కార్యాలయ సమావేశ మందిరంలో వీఆర్వోలు, వీఏఏలతో ఈ–క్రాప్ నమోదు, పంట కోత పరీక్షలపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎస్‌వో నంద, ఏఎస్‌వో ఉన్నారు.